క్లుప్తంగా

సువర్ణముఖి రేవులకు మరమ్మతులు



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న ఆలయ సముదాయం రేవు

సీతానగరం: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తులు నదీస్నానాలకు వెళ్లే సమయంలో ఇబ్బందుల్లేకుండా మండల కేంద్రంలోని సువర్ణముఖి నది రేవులకు జేసీబీ సహాయంతో సోమవారం మరమ్మతులు చేయించారు. మంగళవారంతో కార్తీక మాసం ఆరంభం కానున్నందున నదిలో స్నానాలు చేసి నది ఒడ్డునే వేంచేసిన వేణుగోపాల స్వామి, పంచముఖేశ్వరస్వామి, లక్ష్మీనృసింహస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, బాలసాయి గణపతి, అభయాంజనేయ స్వాములను దర్శించుకునేందుకు భక్తులు వెళ్లడం ఆనవాయితీ. తమ సేవార్థం స్నానాల రేవులను శుద్ధి చేయడంతో భక్తులు అభినందిస్తున్నారు.

రోగులకు ఎమ్మెల్యే పరామర్శ



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఎమ్మెల్యే జోగారావు సోమవారం జిల్లా ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో కలిసి పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్‌తో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. అలాగే రోగులతో మాట్లాడి మీ వైద్యానికి ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరించి అవసరమైతే వేరే ఆస్పత్రిలోనైనా సరైన వైద్యం చేయించి అన్ని విధాలా అండగా నిలిచి ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు బాలేరు గ్రామసచివాలయం ప్రారంభం

భామిని: మండలంలోని బాలేరులో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతులమీదుగా మంగళవారం ప్రారంభించనున్నట్లు జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ పాలక ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం బాలేరు–సాలికిరి గ్రామాల్లో నిర్వహించే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

భామిని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎ.సునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మీ పూజలు



సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ధనలక్ష్మీదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సామూహిక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

వీధికాలువల నిర్మాణం

పాలకొండ రూరల్: స్థానిక కోమటిపేటలో అభివృద్ధి పనులు చకచక జరుగుతున్నాయి. రూ.13లక్షల వ్యయంతో వీధికాలువలు నిర్మిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీజీఎంపీ నిధులో ఈ పనులను చేపడుతున్నట్లు వార్డు కౌన్సిల్ సభ్యులు కె.వి జయ్‌కుమార్ తెలిపారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

వీరఘట్టం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళింగవైశ్య సామాజిక వర్గాన్ని బీసీలుగా గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వీరఘట్టంకు చెందిన కళింగవైశ్య సంఘం సభ్యులు అన్నారు. వీరఘట్టంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ రిజర్వేషన్ ద్వారా తమ పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళింగవైశ్య సంఘం సభ్యులు డాక్టర్ బి.సంపత్‌కుమార్, భోగి మణి, పొట్నూరు పాత్రుడు, కెంగువ ఆంజనేయులు, గుడ్ల గౌరీశంకరరావు, భోగి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి..

మక్కువ:

మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి పండగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు చిచ్చుబుడ్లు, మతాబులు, కాకరపువ్వొత్తులు కాల్చుతూ సందడి చేశారు. వాడవాడలా బాణసంచా వెలుగులు విరజిమ్మాయి.

హాస్టల్‌లో ఎమ్మెల్యే దీపావళి సంబరాలు

పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే అలజంగి జోగారావు దీపావళి పండుగను పురస్కరించుకుని తన కుటుంబంతో కలిసి పార్వతీపురంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలకు వెళ్లి విద్యార్థినుల సమక్షంలో దీపావళి పండగను జరుపుకున్నారు. ఏటా దీపావళి పండుగను అనాథాశ్రమంలోని బాలికలు, ప్రభుత్వ సంక్షేమ గృహాల విద్యార్థినుల సమక్షంలో కుటుంబంతో కలిసి జరుపుకుని వారికి తోడునీడగా తామున్నామన్న భరోసా కలిస్తూ వారిలో ఆయన ఆనందాన్ని నింపుతుంటారు ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ఎమ్మెల్యే జోగారావు విద్యార్థినులతో కలిసి టపాసులు కాల్చారు. ఆయన కుటుంబసభ్యులు వారికి స్వీట్స్ పంచి పెట్టి అందరికీ పేరుపేరున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలో బైక్‌పై ప్రయాణించి పట్టణ ప్రజలను కలిసి దీపావళి జరుపుకుంటున్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు, ఆయన కుటుంబానికి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా దీపావళి సంబరం

సీతానగరం: మండలంలో వాడవాడలా ప్రజలు ఆనందోత్సాహాలతో దీపావళి ఉత్సవాలు జరుపుకున్నారు. లైసెన్స్‌డ్ కంపెనీలు ఉత్పత్తి చేసిన మందుగుండు సామగ్రిని గ్రామాలకు దూరప్రాంతాల్లో విక్రయించడంతో యువకులు, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మతాబా సామగ్రి కొనుగోలు చేసి దీపావళి పండగను ఘనంగా జరుపుకొన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో దీపావళి ఉత్సవాలు జరిగాయి.



పార్వతీపురం టౌన్: వసతిగృహంలో దీపావళి వేడుకలు జరుపుకున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరంలో చిచ్చుబుడ్లు వెలిగిస్తున్న యువకులు, పిల్లలు



మక్కువలో దీపావళి సంబరాలు



బలిజిపేట: వెంగాపురంలో కాకరవత్తులు, చిచ్చుబుడ్లు వెలిగిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని గ్రామాల్లో దీపావళి పండగ ఘనంగా జరుపుకున్నారు. నివాస గృహాల్లో మహిళలు లక్ష్మీదేవి పూజలు చేస్తూ ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం సమయంలో ఇంటింటా దీపాలు వెలిగించి మందుగుండు సామగ్రిని కాల్చారు. చిన్నారులు కాకరవత్తులు, మతాబాలు వెలిగించారు.

చెక్కుల పంపిణీ

సాలూరు: అనారోగ్యాలతో బాధపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అందజేశారు. సంబంధిత వ్యక్తులు, కుటుంబ సభ్యులకు తన స్వగృహంలో ఆదివారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన కస్తూరి రామకృష్ణకు 90 వేల రుపాయలు.. మెంటాడ మండలానికి చెందిన కలగర్ల మోహనరావుకు రూ. 70 వేలు.. మక్కువ మండలానికి చెందిన చందన వెంకటరమణకు లక్షా 40 వేల రూపాయల చెక్‌లు అందజేశారు. ఆర్థిక సాయం పొందిన వారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, మంత్రి రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం పట్టణంలో నిర్వహించిన బైక్‌యాత్ర సుందరయ్య భవనం నుంచి ప్రారంభమై కాంప్లెక్స్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్, రాయగడ రోడ్డు మార్కెట్ యార్డు మీదుగా బైపాస్ రోడ్డు, బంధంవారి వీధి పద్మశ్రీ థియేటర్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా ప్రజల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని లౌకికవాదం ప్రజాస్వామ్యం ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, అసమానతలు లేని సమగ్ర అభివృద్ధి కోసం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బీజేపీ విధానాల్ని తిప్పికొట్టాలని సీపీఎం ప్రజా రక్షణభేరి యాత్రలో భాగంగా నవంబర్ 15 విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం, ఏచూరి కామ్రేడ్ బీవీ రాఘవులు, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాల్గొంటారని, అన్ని తరగతుల ప్రజలు విజయవాడకు తరలిరావాలని పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, కె.రామస్వామి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, వై మన్మథరావు పట్టణ కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు, ఎస్.ఉమ, పాకల సన్యాసిరావు, శంకర్రావు, వి.చిన్నంనాయుడు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తరలింపు

సీతానగరం: సంకిలిలోని చక్కెర కర్మాగారం ఈఐడీ ప్యారీస్ ఇండియా(ప్రై) లిమిటెడ్‌లో చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభించడంతో లారీలతో రైతులు చెరకును తరలిస్తున్నట్లు ఏజీఎం మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈఐడీప్యారీస్ యాజమాన్యం సీనియర్ ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, డీజీఎం (కేన్)రాజేంద్రన్, డీసీసీ సత్యనారాయణల సూచనల మేరకు బొబ్బిలి జోన్ పరిధిలోని రైతులు నేరుగా లారీలతో చెరకు తరలించడానికి అనుమతి పాస్‌లు ఇవ్వడంతో తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు బూర్జ చెరకు తూనిక కేంద్రానికి సమీపంలో ఉన్న చెరకు రైతులు పొలాల్లో పండించిన చెరకును నాటుబళ్లు, టైరుబళ్లతోను, ట్రాక్టర్లతో తరలిస్తున్నారన్నారు. సిబ్బంది పర్యవేక్షణలో నిరంతరం లారీలకు చెరకు లోడ్ చేయడానికి అవసరమైన వసతులు కల్పించి చెరకు సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులకు రాయితీలు ఇవ్వడానికి ప్రకటన జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఆసక్తి కలిగిన వారు రాయితీలను వినియోగించుకుని ప్లాంటేషన్ చేయాలని కోరారు. ఫీల్డ్ సిబ్బంది అక్కేన ఎల్లంనాయుడు, తెర్లి తిరుపతిరావు రైతులకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.



బూర్జ తూనిక కేంద్రంలో లోడ్ చేస్తున్న చెరకు

వరిచేను కోతల్లో నిమగ్నమైన రైతులు

సీతానగరం: మండలంలోని రైతులు వరిచేను కోత పనుల్లో నిగ్నమయ్యారని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ నీటి వనరులున్న గ్రామాల్లో ముందుగా వరినాట్లు వేయడంతో వరిచేలు పండినా దీపావళికి వర్షం కురుస్తుందన్న నానుడి బలంగా రైతుల్లో ఉన్న కారణంగా ఇంతవరకూ వరిచేను కోతపనులు చేపట్టలేదని తెలియజేశారు. దీపావళి మరుసటి రోజు నుంచే ప్రభుత్వం రాయితీపై సమకూర్చిన యంత్రాల సహాయంతో వరిచేను కోస్తున్న ధాన్యాన్ని రైతులు కూడిక చేసుకుంటున్నారన్నారు. కూలీలతో కోస్తున్న వరి చేను పంటను మడులలోనే కుప్పలు పెడుతున్నారని చెప్పారు. ధాన్యం దిగుబడి ఆశాజకంగా ఉన్నందున వరిచేను కోసిన, నూర్పు చేయాల్సిన రైతుల కోసం ముందుగా ధాన్యం లోడింగ్ కోసం గన్నీబ్యాగ్‌లు, వాహనాలు సమకూర్చనున్నట్లు చెప్పారు. నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోలు చేయడానికి, ధాన్యం సేకరించాల్సిన టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇచ్చి, ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు వివరించారు.



లక్ష్మీపురంలో వరిచేను కోస్తున్న యంత్రం

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల 20వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

గండి పూడ్చివేతకు చర్యలు

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామంలో గల మాది చెరువుకు పడిన గండిని ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాలమేరకు తక్షణమే చర్యలు తీసుకుంటామని ఏఈ ఎస్.సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి మదుము లీకుల కారణంగా చెరువుగట్టుకు పడిన గండిని సోమవారం ఉదయం జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు బి శ్రీరాములు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావుతో కలిసి ఇరిగేషన్ ఏఈ ఎస్.సోమేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ సోమేశ్వరరావు మాట్లాడుతూ వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ కాలువ పరిధిలో ఉన్న మాదినాయుడు చెరువుకు గండిపడిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించి తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. చెరువుకు గండిపడి ఆయకట్టు భూమిలో కోతకు సిద్ధంగా ఉన్న వరిచేనులో మేట వేయడంతో పంటనష్టంతో పాటు గండి పూడ్చడానికి రూ.2 లక్షలు ఖర్చవుతుందన్నారు. తాత్కాలికంగా గండి పూడుస్తామని, వాతావరణం అనుకూలించిన వెంటనే పూర్తిస్థాయిలో గండి పూడ్చివేత పనులు ప్రారంభించనున్నామని స్పష్టం చేశారు. గండిని పరిశీలించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ఆయకట్టు రైతులు టి.వెంకటప్పలనాయుడు, ఆర్వీ పార్థసారథి, పి సూర్యనారాయణ, పి.రామకృష్ణ, ఆర్.తవిటి నాయుడు పాల్గొన్నారు.



మాదినాయుడు చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిదులు,అధికారులు

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

సీతంపేట: మండలంలోని గొయిది గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంతం భగవద్గీతను ప్రచారం చేసినట్టు ప్రబోధన సేవాసమితి హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా దీపావళి పండగ ప్రసస్తిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు దుర్గారావు, పుండరీకాక్షయ్య, ఈశ్వర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోవర్ధన గిరి పూజలు

భామిని: మండలంలోని లివిరి గోపీనాథరాధాకృష్ణ మందిరం, బత్తిలి రాధాగోవిందస్వామి మందిరంలో సోమవారం గోవర్ధన గిరి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోవులను, గోపాలకులను రక్షించేందుకు గోవర్ధన గిరిని ఎత్తిన రోజున ఈ ఉత్సవాన్ని జరుపుకోవడం సంప్రదాయం. మూలవిరాట్ ముందు గోవర్ధన పర్వతం ఆకృతిలో పండ్లు, కాయలతో అలంకరించారు. పాలుతో చేసిన జున్ను, కోవా వంటి పదార్థాలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు.



లివిరి గోపీనాథరాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు

ముస్తాబైన శివాలయాలు

గరుగుబిల్లి: కార్తీకమాసంలో పూజలందుకునేందుకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. రావుపల్లిలోని ఉమారామ లింగేశ్వరాలయం, శివ్వాంలోని రామలింగేశ్వరాలయం, పెద్దూరులోని సాంబశివుడు, గొట్టివలసలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర, చినగుడబ తదితర గ్రామాలలోని శివాలయాలను సుందరంగా అలంకరించారు. కాగా శివ్వాం, గొట్టివలస గ్రామాలలోని శివాలయాలకు మండలంలోని భక్తులతో పాటు పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



గొట్టివలసలో ముస్తాబుచేసిన శివాలయం

ఆధ్యాత్మిక మాసం కార్తీకం

- నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం
- నెల రోజుల పాటు గ్రామాల్లో ఆధ్యాత్మికత శోభ
- ముస్తాబైన శివాలయాలు

పాలకొండ రూరల్:

కార్తీకమాసం వచ్చేసింది. మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో భక్తులు భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో పరమేశ్వరుడిని ఆరాధిస్తారు. నేటి నుంచి నెల రోజుల పాటు పల్లెలు, పట్టణాలు అనే బేధం లేకుండా ప్రతీచోట ఆధ్యాత్మికశోభ వెల్లివిరుస్తుంది. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగుతాయి. కార్తీకమాసంలో చేసే దీపారాధన, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని విశ్వాసం.

దీపార్పణ శుభప్రదం

భగవంతుని ముందర అఖండ దీపానికి శ్రేష్టమైన మట్టి ప్రమిదల వినియోగం ఇంటికి శుభకరం. స్టీల్ లోహంతో తయారు చేసిన ప్రమిదల వాడకం అశుభం. ఇత్తడి, కంచు లోహాలతో తయారైన ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తే ఆ ఇంట తేజస్సు, కళ అధికమవుతాయి. వెండి, బంగారు ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. ప్రమిదల్లో వత్తులను శ్రేష్టమైన ఆవు నెయ్యితో వెలిగించటంతో ఆధ్యాత్మి పరిమళాలు విరాజిల్లుతాయి.

జాగారాలకు ప్రాముఖ్యం

పవిత్ర కార్తీక మాసంలో చేపట్టే జాగారాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. జాగారంలో జాగృతి అంటే మేల్కొనడం అన్న అంతర్యాన్ని సూచిస్తుంది. కార్తీక పర్వదినాల్లో చేపట్టే ఉపవాసాలు, జాగారాలు మోక్షంతోపాటు చక్కటి ఆరోగ్యం లభిస్తుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మాసంలో ఒక పూట భోజనం ఆచరించి, రెండవ పూట ఉపవాసం చేస్తారు. దీనివల్ల శరీరంలో ఉష్ణం పెరగదు. అందుకే ఈ మాసంలో ఉపవాసాలు చేపట్టేవారు నీరసించిపోరు. కొందరు భక్తులు కార్తీక పురాణ కాలక్షేపం చేస్తూ, శ్లోకాలను పఠిస్తారు. దీనివల నైతిక, ఆధ్యాత్మిక విలువలు తెలుసుకునేందుకు అవకాశాలు మెరుగుపడతాయి.



కార్తీక పూజలు అందుకునేందుకు సిద్ధమైన తంపటాపల్లి ద్వితీయ లింగేశ్వరులు

ఆరోగ్య సోపానం

కార్తీకమాసం మంగళప్రదమే కాదు, ఆరోగ్యదాయకం కూడా. ఆరోగ్యంగా ఉండేందుకు ఈ నెలలో ఎక్కువగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఉదయాన్నే చన్నీటి స్నానం ఆచరించి భగవంతునికి పూజలు చేయటం ద్వారా శరీరం ఉత్తేజం అవడంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుంది. రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చు. స్త్రీలలో చోటుచేసుకునే అనేక రుగ్మతులు తొలగిపోతాయి. నియమాలతో కూడిన దినచర్యలు ఓ ఔషదంగా భావించాల్సి ఉంది.

ఏకాగ్రత..

కార్తీక మాసంలో వేకువజామున లేవటం, స్నానం చేయటం, పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శరీరం, మనసు ఉత్తేజమవుతాయి. బద్ధకం పోయి పనిపై ఏకాగ్రత కుదురుతుంది. తేలికైన ఆహారం తినటం, మాంసాహారానికి, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం మంచి ఆరోగ్య క్రియగా చెప్పవచ్చు.

ముఖ్యంగా ఈ కాలంలో తినే శాకాహారంలో ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవటంతో శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. దీంతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

ఆధ్మాత్మిక సోపానాలు పర్వదినాలు

కార్తీకలో అత్యధికంగా పర్వదినాలున్నాయి. వీటని పాటించటం ద్వారా మేలు చేకూరుతుంది. నేడు ఆకాశ దీపారాధనతో పవిత్ర కార్తీకం ప్రారంభమౌతుంది. ఈ క్రమంలో ప్రముఖ శివ క్షేత్రాలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యాయి. ఈ నెల 15న యమవిదియ, భగినీ హస్త భోజనం(అన్నాచెల్లెల పండగ), 17న నాగుల చవితి, 20న మొదటి సోమవారం (కార్తీక స్నానాలు) చేయాల్సిఉంటుంది. 23న ఏకాదశి, 24న క్షీరాబ్ది ద్వాదశి, 25న శని త్రయోదశి. 26న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం, 27న రెండవ సోమవారం. 30న ఆరుద్ర నక్షత్రము, డిసెంబర్ 4వ తేదీన మూడవ కార్తీక సోమవారం. 10న త్రయోదశి నందీశ్వర అభిశేకం. 11న నాలుగవ సోమవారం (మాస శివరాత్రి), 12న అమావాస్య, 13 పోలి స్వర్గంతో కార్తీక దీక్ష ముగుస్తుంది.

– దార్లపూడి లక్ష్మిప్రసాద్ శర్మ, కోటదుర్గమ్మ దేవస్థానం ప్రధాన అర్చకులు, పాలకొండ

చేతిలో పేలిన టపాసు

సీతంపేట: దీపావళి బాణసంచా చేతిలో కాలిపోవడంతో మానాపురం గ్రామానికి చెందిన బిడ్డిక సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి ఇంటి ముందు పటాసులు కాలుస్తుండగా ఊహించని విధంగా ఒక పటాసు చేతిలో పేలిపోవడంతో కుడిచేయి వేళ్లు కాలిపోయాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా.. ఈఎంటీ ఎ.శ్రీనివాసరావు, పైలట్ ఎం.తేజ సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్య కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

ఇళ్ల స్థలాల మంజూరుపై హర్షం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ప్రమాద బీమా, హెల్త్ మంజూరు వంటివి పాత్రికేయ వర్గాలకు సామాజిక భద్రత కల్పిస్తాయన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనంగా పేర్కొన్నారు.